క్లుప్తంగా

వరల్డ్ రికార్డు సాధించిన యువకుడికి సన్మానం



సుభాకర్‌రాజు సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

బేతంచెర్ల: పట్టణానికి చెందిన యువకుడు సుభాకర్ రాజు 1 గంట 40 నిమిషాల పాటు ఏకధాటిగా నీటిలో పద్మాసనంలో కూర్చొని వరల్డ్ రికార్డు సాధించారు. గతనెల 24వ తేదీన సుభాకర్ రాజుకు వరల్డ్ రికార్డు మెడల్ సర్టిఫికెట్ ప్రధానం చేశారు. స్థానిక ప్రైవేట్ హైస్కూల్ పూర్వ విద్యార్థి అయిన సుభాకర్ రాజును శుక్రవారం రోటరీ క్లబ్ సభ్యులు సన్మానించారు. శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. పట్టుదల ఏకాగ్రత శక్తితో ఏదైనా సాధించవచ్చని ఎంఈఓ సోమశేఖర్ అన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

కొలిమిగుండ్ల: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని రెండు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ సుబ్బరాజు పరిశీలించారు. మార్చి 13న పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మౌలిక వసతుల ఏర్పాటుపై హెచ్‌ఎం సోమశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1010 మంది, టీచర్స్‌కు సంబంధించి 66 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని తహసీల్దార్ చెప్పారు.

సుద్దముక్కతో సూక్ష్మ శివలింగం



ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన చిత్రకారుడు బండి మధు కృష్ణ సుద్దముక్కతో సూక్ష్మ శివలింగాన్ని తయారు చేశాడు. మహాశివరాత్రిని పురస్కరించుకుని 1.5 మిల్లీమీటర్లు పొడవు, 5 మిల్లీమీటర్ల వెడల్పుతో ఈ శివలింగాన్ని చేసినట్లు మధుకృష్ణ తెలిపాడు. గంట వ్యవధిలో శివలింగాన్ని తయారు చేశానన్నారు.

ఇష్టంతో కష్టపడి చదవండి



మాట్లాడుతున్న ఎంఈఓ సోమశేఖర్

బేతంచెర్ల: మీ తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు ఇష్టంతో కష్ట పడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుమేధా ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను పాఠశాల డైరెక్టర్లు విజయ నాగరాజు, గుండా గోపాల్, బుగ్గన శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ సోమశేఖర్ మాట్లాడుతూ విద్యార్థిలో జ్ఞాన అంధకారాన్ని తొలగించే వ్యక్తి గురువు అన్నారు. ప్రాచీన కాలం నుండి నేటి వరకు విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయుడి పాత్ర అమోఘం అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

చురుగ్గా రోడ్డు నిర్మాణ పనులు

డోన్ : డోన్ మండలం తిరునాంపల్లె క్రాస్ రోడ్డు నుంచి కొత్తబురుజు గ్రామం వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు స్థానంలో రెండున్నర కిలోమీటర్ల మేర నూతన రహదారిని నిర్మించేందుకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం రూ.3కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు రోడ్డు నిర్మాణ చురుగ్గా సాగుతున్నాయి. శుక్రవారం సర్పంచ్ ఆలం కొండ తేజోమణి, ఎంపీటీసీ సభ్యురాలు నీలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గిడ్డారెడ్డి, గిరిధర్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. రహదారి సమస్య తీరనుందని ఈ సందర్భంగా వారు సంతోషం వ్యక్తం చేశారు.



తిరునాలంపల్లె, కొత్తబురుజు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

బీసీ...ఎందుకంత కడుపు మంట!

- టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి తీరుపై మండి పడిన ఎమ్మెల్యే కాటసాని
- పేదలకు మంచి జరిగితే ఓర్వలేరా?
- గతంలో ఇంటి పట్టాల కేటాయింపును ... నేడు భూ పంపిణీని అడ్డుకోవడంలో మీ ఉద్దేశం ఏమిటి?
- నిరుపేదలకు భూమి అందజేస్తుంటే కోర్టుకెళ్లి మోకాలడ్డడం ఎంతవరకు న్యాయం?



సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పేదలకు మంచి జరుగుతుంటే... టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి కడుపు మంట ఎందుకో తమకు ఏ మాత్రం అర్థం కావడం లేదని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. గతంలో బనగానపల్లె పట్టణంలో దాదాపు మూడువేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు తాను సర్వం సిద్ధం చేయగా కోర్టుకెళ్లి అడ్డుపుల్లేసిన మాజీ ఎమ్మెల్యే బీసీ ప్రస్తుతం కొలిమిగుండ్ల మండలంలో నిరుపేదలకు ప్రభుత్వ అనుమతితో భూ పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టగా మళ్లీ కోర్టుకు వెళ్లి మోకాలడ్డుతున్నారని ధ్వజమెత్తారు. పేదలకు మేలు జరిగుతుంటే ఓర్వలేరా... అసలు మీ ఉద్దేశం ఏమిటి అని కాటసాని మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి... మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి తీరును తప్పుపట్టారు. పేదలకు సాగుభూమి అందజేయాలనే సదుద్దేశంతో ప్రభుత్వం అనుమతితో ఎనిమిదవ విడత భూ పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో సాగుభూమిలేని నిరుపేదలకు దాదాపు 8, 325 ఎకరాలను పంపిణీ చేసేందుకు చర్యలు సర్వం సిద్ధం చేశామని, లబ్ధిదారుల ఆధార్‌కార్డు, అడ్రస్ వివరాలను రెవెన్యూ అధికారులు దరఖాస్తులో పొందపరిచారని వివరించారు. కొలిమిగుండ్ల మండల పరిధిలోని పెట్నికోట, తుమ్మలపెంట, గోరుమాన్‌పల్లి, తిమ్మనాయునిపేట బి తాడిపత్రి, తొళ్లమడుగు, మిర్జాపురం, నందిపాడు, హనుమంతగుండం, ఎర్రగుడి, కల్వటాల, బెలుం, పెద్దవెంతుర్ల, సంగపట్నం(అవుకు మండలం) తదితర గ్రామాల్లో నిరుపేదలను గుర్తించామన్నారు. అయితే ఈ భూముల్లో లైమ్‌స్టోన్ ఉందని.. జీయాలజికల్ సర్వే రిపోర్టు కూడా ఉందని... ఈ భూములు ఫ్యాక్టరీలకు ఉపయోగ పడుతాయని.. పంపిణీ చేయొద్దంటూ బీసీ జనార్దన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించి పిల్ వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేదల పక్షాన నిలబడాల్సిన బీసీ... కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తున్నారని కాటసాని విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గమిస్తున్నారని, మాజీ ఎమ్మెల్యే బీసీ తన తీరు మార్చుకోకుంటే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కాటసాని హెచ్చరించారు.

టీడీపీ పాలనలో ఎకరానైనా పంపిణీ చేశారా?

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పేదలకు కనీసం ఎకర భూమి అయినా పంపిణీ చేశారా అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నిలదీశారు. అసైన్‌మెంట్ ద్వారా కనీసం భూ పంపిణీ చేయని బీసీ... ధనవంతులైన తన అనుచరులకు మాత్రం ఒక్కొక్కరికి ఎకరాలెకరాలు ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేయించారని ధ్వజమెత్తారు. అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి తనవారికి అప్పగింతలకు పాల్పడ్డారని,ఆ భూములు తీసుకున్న బీసీ జనార్దన్‌రెడ్డి ముఖ్యులు సిమెంట్ ఫ్యాక్టరీలకు అధిక ధరలకు విక్రయించుకుని సొమ్ము చేసుకున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం చట్టబద్ధంగా పేదలకు చేస్తున్న భూ పంపిణీని కోర్టుకెళ్లి అడ్డుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఆన్‌లైన్‌లో అక్రమంగా ఎక్కించిన తన అనుచరులకు సంబంధించిన సర్వేనంబర్లను పిల్‌లో ఎందుకు పొందపచరలేదని నిలదీశారు. రాజకీయ నాయకులు ప్రజల మంచికోరాలే తప్పా... ఆ కార్యం జరిగితే ప్రత్యర్థికి పేరొస్తుందనే భావన ఏ మాత్రం ఉండకూడదని సూచించారు. దాదాపు 18 సంవత్సరాల క్రితం కొలిమిగుండ్ల మండలంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులు రైతుల నుంచి భూమిని సేకరించి కొంత మొత్తాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. అయితే ఈ మొత్తం తమకు గిట్టుబాటు కాదని రైతులు ఫ్యాక్టరీ ప్రతినిధులను కోరితే నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాల్సిన సీఎఫ్ఆర్ నిధులను రైతులకు చెల్లిస్తే తాను అడ్డుచెప్పలేదన్న విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని గుర్తు చేశారు.

భక్తులకు వసతులు కల్పిస్తాం

డోన్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక పాత, కొత్తబుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయాలతో పాటు మాలిక్ బాబా సంస్థాన్ ఆవరణలో భక్తులకు వసతులు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం కొత్తబుగ్గ దేవస్థానం పరిసరాలను వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. మూడురోజుల పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు తదితర వసతులు కల్పిస్తామని చెప్పారు. దేవస్థానం ఆవరణలో ఏర్పాటైన దుకాణాలకు విద్యుత్ సౌకర్యం ఇప్పటికే కల్పించడం జరిగిందన్నారు.



కొత్తబుగ్గ ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్

సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

అవుకు: మండల పరిధిలోని కునుకుంట్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయని ఎన్నికల అధికారి డాక్టర్ పద్మావతి తెలిపారు. కునుకుంట్ల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘానికి 2018 ఎన్నికలు నిర్వహించిన సమయంలో 31 మంది సభ్యులు ఉన్నారని, ప్రస్తుత ఎన్నికల్లో 25 మంది పాల్గొన్నారఅన్నారు. అవుకు పశువైద్యాధికారి భారతీదేవి సహకారంతో ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అధ్యక్షుడిగా సద్దల పెద్ద సబ్బరాయడు, సెక్రటరీగా నంద్యాల గొల్ల పెద్ద మద్దిలేటి, డైరెక్టర్లుగా నంద్యాల ప్రతాప్, నంద్యాల గొల్ల శివన్న, ప్రతాప్, నంద్యాల అచ్చన్న, వెంకట క్రిష్ణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు.



ఎన్నికైన వారికి ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న డాక్టర్లు పద్మావతి, భారతీదేవి

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు రెడ్‌క్రాస్ అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. రెడ్‌క్రాస్ నిర్వాహకులు నాగశేషయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలు, భక్తులకు అందిస్తున్న వైద్య సేవల గురించి శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఆరా తీశారు. కైలాస ద్వారం వద్ద ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రెడ్‌క్రాస్ శిబిరాన్ని సందర్శించి భక్తులకు మందులను పంపిణీ చేశారు. 24 గంటల పాటు వైద్యసేవలను అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులను కలెక్టర్, ఎమ్మెల్యే అభినందించారు.

అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి పోటీలు

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి ఉత్సవాలను పురష్కరించుకొని పెట్నికోట గుండుమల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని క్రీడా మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు అట్టహాసంగా ప్రారంభ మయ్యాయి. ప్రసన్న పార్వతి గుండుమల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ పోటీలను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. రాయలసీమ జిల్లాలతో పాటు వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఈసందర్భంగా జెడ్పీచైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 24 ఏళ్ల నుంచి ప్రతి ఏటా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. యువతకు మంచి భవిష్యత్ ఉందని, దేశవాళీ పోటీల్లో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, నందిపాడు, కమ్మవారిపల్లె సర్పంచ్‌లు గుర్విరెడ్డి, కొండయ్య, నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, శివారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, కొండారెడ్డి, సుబ్బారెడ్డి, తెలుగు పండిట్ వైవీఎస్ నారాయణరెడ్డి, రామాపురం, హరివరం హెచ్‌ఎంలు భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పీడీలు వెంకటేశ్వర్లు, భుజంగరావు, హరికృష్ణ, శ్రీనివాసులు,శేఖర్ పీఈటీలు సాంబశివారెడ్డి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ఓపెన్ డే విజయవంతం

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఓపెన్ డే కార్యక్రమం విజయవంతమైంది. పట్టణంలోని వివిధ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు కళాశాలను సందర్శించారు. జవహర్ నాలెడ్జ్, స్కిల్ సెంటర్లు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీలను పరిశీలించారు. అలాగే వివిధ ప్రయోగశాలలకు వెళ్లి పరికరాలు, జంతునమూనాలు, హెర్బేరియం, సైన్స్ ఎగ్జిబిషన్, స్పెషిమన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రణాళికా బద్ధంగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, చంద్రపాల్, గురవయ్య, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రయోగశాలలో వివిధ నమూనాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- గ్రామ సచివాలయాలను తనిఖీ చేసిన డీఎల్‌డీఓ

కోవెలకుంట్ల: గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలని డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీఓ) జనార్దన్‌రావు సూచించారు. శుక్రవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 1, 4వ గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, గ్రామ సచివాలయల ద్వారా అందుతున్న సేవలు, నిర్దేశించిన లక్ష్యాలు తదితర రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం నష్టపోకూడదని పేర్కొన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి, ఈఓపీఆర్డీ రాధిక, ఈఓ బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ

మహా శివరాత్రి వేడుకలు విజయవంతం చేద్దాం

ఆళ్లగడ్డ: పురాతన శివాలయం కొలువైన రామతీర్థ పుట్లాలమ్మ క్షేత్రంలో మహా శివరాత్రి వేడుకలను విజయవంతం చేద్దామని క్షేత్ర చైర్మన్ గుంగుల మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. క్షేత్రం పాలక మండలి కార్యాలయంలో శుక్రవారం పాలక మండలి, అభివృద్ధి కమిటీ సభ్యుల సమావేశంలో శివరాత్రి వేడుకల పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ శివరాత్రి వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆదివారం ఉదయం వరకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించే చర్యలు పూర్తయ్యాయన్నారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య లింగోద్భవ కాలములో రుద్రాభిషేకం అనంతరం శ్రీ పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. జాగరణ చేసే భక్తులు నిద్ర మేలుకొనేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పాలకమండలి సభ్యులు గంగిశెట్టి తిమ్మయ్య, నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.



వైభవంగా నంది విగ్రహ ప్రతిష్ఠోత్సవం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని శ్రీ భవాని సమేత శ్రీ భృంగీశ్వరస్వామి ఆలయంలో నంది విగ్రహ ప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. రెండో రోజు శుక్రవారం అర్చకులు విశిష్టపూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై పరమశివునికి జలాభిషేకం, కలశపూజ , మంగళహారతి నిర్వహించారు. అనంతరం నంది విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొని మాట్లాడారు. ఎంతో చరిత్ర కలిగిన భృంగీశ్వరస్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రస్తుతం శ్రీవీరనారాయణ స్వామి ఆలయానికి వచ్చే భక్తులు పక్కనే ఉన్న శ్రీ భృంగీశ్వరస్వామికి వచ్చి పూజలు చేసుకుంటున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాణ్యం గ్రామంలో జరిగిన పలు వివాహాలకు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కరుణాకర్‌రెడ్డి, పాణ్యం ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుబ్బరాయుడు, పుల్లయ్య, బాబు, మాజీ ఆలయ చెర్మన్లు రాజనాల సుధాకర్, శంకర్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, ఎల్లకిట్టు, వెంకటేశ్వర్లు, లక్ష్మీరెడ్డి, నారాయణ, టైలర్‌బాషా, పిన్నాపురం సర్పంచ్ ఎల్లక్రిష్ణయ్య, మహీంద్రారెడ్డి , వెంకట సుబ్బయ్య, గౌడ్, ఆటోమాబు, తదితరులు పాల్గొన్నారు.

యాగంటిలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



యాగంటి క్షేత్రంలో ధ్వజారోహణము కార్యక్రమంలో పాల్గొన్న ఈఓ,ఆలయ చైర్మన్

బనగానపల్లెరూరల్: యాగంటి క్షేత్రంలో భక్తిశ్రద్ధల మధ్య ధ్వజారోహణ కార్యక్రమంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్వామివారిని దర్శించుకునేందుకు మొదటిరోజే భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఓం నమ:శివాయ నామస్మరణం మారుమోగింది. తెల్లవారు జామున ఉదయం 5 గంటలకు ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఏకశిలా రూపంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వరులకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్రనామావళి అనంతరం 8 గంటలకు ధ్వజారోహన కార్యక్రమాన్ని సంప్రదాబద్ధంగా నిర్వహించారు. భక్తులకు శ్రీ ఉమామహేశ్వర స్వామి, రైతు, ఆర్యవైశ్య నిత్యాన్నదాన సంస్థల్లో అన్నదానం చేశారు. సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐ రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్రీనగరేశ్వర స్వామి దేవాలయం ముస్తాబు

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేటలోని శ్రీనగరేశ్వరస్వామి దేవాలయాన్ని శివరాత్రికి నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు పోచా గార్డెన్స్‌లో శ్రీనగరేశ్వరస్వామి దేవాలయంలో శివ పార్వతుల కల్యాణోత్సవం శుక్రవారం పోస్టర్లను ఆలయ ధర్మకర్త డాక్టర్ పోచా ప్రభాకర్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ తేదీ శనివారం మహా శివరాత్రి పురష్కరించుకొని ఉదయం 5గంటల నుంచి అభిషేకాలు, అర్చనలు, ఆదివారం తెల్లవారు జామున 19వ తేదీన 4గంటల నుంచి శివ పార్వతుల కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి గోర్లగుట్ట మహా శివరాత్రి ఉత్సవాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామంలో వెలసిన భ్రమరాంభికదేవి సమేత బుగ్గ రామేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి మహాశివ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కార్య నిర్వాహక, అభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు రుద్రాభిషేకం, 19వ తేదీన తెల్లవారుజామున 4గంటలకు స్వామి, అమ్మవార్లకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు

ప్యాపిలి: స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శని, ఆదివారాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6-30 గంటలకు సామూహిక రుద్రాభిషేకం, 11 గంటలకు మహా మంగళహారతి, మధ్యాహ్నం 2 గంటలకు కలశ శోభియాత్ర, సాయంత్రం 5-30 గంటలకు రుద్రాభిషేకం, రాత్రి 8 గంటలకు మహామంగళ హారతి, రాత్రి 11-30కు లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకం, రాత్రి 1-30కు మహా మంగళహారతి, 2 గంటలకు రుద్రహోమం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆదివారం ఉదయం 7 గంటలకు శివపార్వతుల కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 5 గంటలకు ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట మఠంలో మహాశివ రాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం భక్తులు (భేతశ్వర) శివలింగానికి సామూహిక అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం ఆశ్రమ కమిటీ సభ్యులు గుండా గోపాలు, సముద్రాల రామకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు ప్రభాకర శాస్త్రీ, సాయి తేజ శర్మ శాస్త్రోకంగా మంత్రాలు చదవుతూ వినాయకుడికి అభిషేకం, భేతేశ్వర శివలింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో సామూహిక అన్నాభిషేకం చేశారు. కార్యక్రమంలో పూదోట కమిటీ సభ్యులు బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి ,సముద్రాల మద్దిలేటిస్వామి,నాగమోహన్‌రెడ్డి, ఏవీ నరసింహులు, చంద్రమౌళి,శేషని పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో నిల్చున్న భక్తులు



నందీశ్వరుడిని దర్శించుకుంటున్న శివభక్తులు

పట్టువస్త్రాల సమర్పణ

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ధర్మకర్తల మండలి తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. శుక్రవారం పట్టువస్త్రాలతో ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, గురుమహంత్ ఉమామహేష్, ఎం.విజయలక్ష్మి, బి.రాజేశ్వరి, ఎ.లక్ష్మీసావిత్రమ్మ, మధుసూదన్‌రెడ్డి, సూరిశెట్టి మాధవీలత, సి.కనకదుర్గలకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం ఆలయ రాజగోపురం వద్ద స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు, ధర్మకర్తల మండలి తరపున తీసుకువచ్చిన పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు సమర్పించారు.

సచివాలయ ఉద్యోగుల ఇష్టారాజ్యం!

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ సేవలు అందరిమన్ననలు పొందుతున్నా... అక్కడక్కడ కొందరు ఉద్యోగుల నిర్లక్ష్యం మూలంగా విమర్శలు చేటుచేసుకుంటున్నాయి. ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం... పైగా తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు ఉన్న ప్రాంగణం... అయినా అక్కడే ఉన్న రెండు సచివాలయాల్లో ఉద్యోగులు విధుల పట్ల తమ నిర్లక్ష్యాన్ని చాటుకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకే రెండు సచివాలయాల్లో ఒకరు, ఇద్దరు మినహా ఖాళీగా దర్శనమిచ్చాయి కుర్చీలు. రెగ్యులర్ పంచాయితీ కార్యదర్శి సైతం విధులకు ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయ భవనాలు నిర్మాణంలో ఉండటంతో ఎంపీడీఓ కార్యాలయం చెంతనే ఉన్న గెస్ట్ హౌస్‌లో కార్యాలయాలు ఏర్పాటు చేశారు అధికారులు. రెండు ఓకే చోట ఉన్నందున ఎవరు వస్తున్నారో... ఎవరు రావడం లేదో తెలియక ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. ఉద్యోగులు సాయంత్రం 3గంటలకే తిరుగు ముఖం పడుతున్నారనే విమర్శలు లేకపోలేదు. సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండరని ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. కనీసం ఉన్నవారు కూడా సమాచారం ఇవ్వడం లేదంటున్నారు. విషయాన్ని ఎంపీడీఓ సుబ్బరాజు దృష్టికి తీసుకెళ్లగా రెండు సచివాలయాల్లో ఆరు మంది సెలవులో ఉన్నారన్నారు. గైర్హాజరైన వారిపై సోమవారం విచారించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ చెప్పారు.



ఉద్యోగులు లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

గిరిజనుల అభివృద్ధికి చర్యలు

డోన్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం గిరిజన అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని ఆర్డీఓ వెంకటరెడ్డి అన్నారు. తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. డోన్ రెవిన్యూ డివిజన్ పరిధిలో తండాల్లో మౌలిక వసతుల కల్పనపై శుక్రవారం నంద్యాల్లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. పాణ్యం మండలం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి గోరుకల్లు తండా వరకు మంచినీటి పైపు లైనును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.